
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 19 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 521.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.3,600, మోడల్ ధర రూ.2,900 వరకు పలికింది.



ఎన్టీటీపీఎస్ సీఈగా నవీన్

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్‌గా పి.నవీన్‌గౌతమ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన అశోక్‌కుమార్‌రెడ్డి విద్యుత్ సౌధలో జనరేషన్ చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ అయ్యారు.

న్యూస్‌రీల్

వైద్య సిబ్బంది బదిలీలకు గ్రీన్ సిగ్నల్

గుంటూరు మెడికల్: వైద్య సిబ్బంది సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయా జిల్లాల డీఎంహెచ్‌ఓలకు బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశారు. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను తమ కార్యాలయానికి అందించాలని వెల్లడించారు.

25, 27, 31 తేదీల్లో టెన్త్, ఇంటర్ టాపర్లకు సన్మానం



నరసరావుపేట: ప్రభుత్వ విద్యాలయాల్లో పదోతరగతి, ఇంటర్మీడియెట్ చదివి టాపర్లుగా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలను నియోజకవర్గస్థాయిలో ఈనెల 25న, జిల్లాస్థాయిలో 27న సన్మానించనున్నట్టు కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. ఈ అంశంపై గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నిర్వహించిన వీడియో సమీక్షలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. టెన్త్‌లో జిల్లా స్థాయిలో తొలి మూడు స్థానాల్లో టాపర్లుగా నిలిచిన వారికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని వివరించారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సన్మానం ఉంటాయని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 31న సన్మానం ఉంటుందని తెలిపారు. సమీక్షలో జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారిణి నీలావతి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్గొన్నారు.

రిగ్గు యజమానులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

నరసరావుపేట: వాల్టా చట్టాన్ని అనుసరించి జిల్లాలోని రిగ్గు యజమానులు అందరూ తమ రిగ్గులను తన కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకోవాలని భూగర్భ జల శాఖ జిల్లా అధికారి టి.సత్యనారాయణశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్టర్ చేయించుకుని గడువు ముగిసిన వారు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌లేని రిగ్గుల ద్వారా బోర్లు వేసినట్లు రుజువైతే చట్టప్రకారం ఆ రిగ్గు యజమానికి రూ.లక్ష జరిమానా విధించి రిగ్గు సీజ్ చేయనున్నట్టు పేర్కొన్నారు. రైతులు భూసర్వే చేయించుకొని బోరు వేయించుకుంటే బోరు విఫలమయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 99491 61800, 08647-220114 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీజీహెచ్‌లో సాయంత్రం ఓపీ సేవలు ప్రారంభం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి సాయంత్రం వేళ ఓపీ ప్రారంభిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాల మేరకు గురువారం ఈవెనింగ్ ఓపీని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓపీ అందుబాటులో ఉంటుందని వివరించారు. ఉదయం ఓపీలో వైద్యులు రాసి ఇచ్చిన వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలను అదేరోజు ఈవెనింగ్ క్లినిక్‌లో చూపించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ ఝాన్సీ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందించారు. గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన జల్లూరి ఎస్ఎస్‌వీవీ, ఎంఎస్‌వీ బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకుంది. ఆలయ అధికారులను కలిసి రూ.1,10,116 విరాళాన్ని అందించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేదాశీర్వచనం అందించారు.

తెచ్చినావ.. సంబరం

- జగనన్న వరంపై గంగపుత్రుల సంతోషం
- తీరానికి మరో మణిహారం'
- వాడరేవులో రూ.417.55 కోట్లతో 52 ఎకరాల్లో హార్బర్
- 23 వేల మందికి ఉపాధి అవకాశాలు
- శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సంబరమేదో వచ్చినట్టు తీరంలో అలలు ఆనందపర్వమై ఎగసిఎగసి పడుతున్నాయి. కొత్త మణిహారమేదో అలంకరించబోతున్నట్టు కడలి ఉత్సాహంతో ఉప్పొంగుతోంది. జయజయధ్వానాలు చేస్తున్నట్టు.. కెరటాల హోరు లయబద్ధంగా ఘోషిస్తోంది. ఇన్నాళ్లు తెచ్చిన మత్స్య సంపద దళారుల పరం అవుతుంటే కన్నీటి సుడులలో సతమతమవుతూ ఆదుకునే ఆపన్నహస్తం కోసం నిరీక్షించిన గంగపుత్రుల కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల నెరవేరబోతోంది. ఫలితంగా మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వాడరేవు హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు మోపిదేవి, నందిగం, మంత్రులు అప్పలరాజు, మేరుగ, ఎమ్మెల్యే కరణం, కలెక్టర్ రంజిత్ తదితరులు

చీరాల: వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం త్వరలో సాకారం కాబోతోంది. దీని కోసం ఈనెల 16న నిజాంపట్నం నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు రూ.417.55 కోట్లతో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది.

పదేళ్ల క్రితమే సర్వే

చీరాలలో హార్బర్ నిర్మాణానికి 2012 నుంచే సర్వే నిర్వహించారు. 2015లో కేంద్రం సాగరమాల పథకం ప్రవేశపెట్టిన కొద్దిరోజుల్లోనే హార్బర్‌కు, పోర్టుకు అనుకూల ప్రాంతంగా చీరాల వాడరేవును ప్రభుత్వాలు ఎంచుకున్నాయి. పలుమార్లు సర్వే కూడా చేశాయి. మినీ హార్బర్, ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాలని నిర్ణయించినా ప్రతిపాదనకే పరిమితమైంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలోని వాడరేవులో కొత్త హార్బర్ నిర్మాణం, నిజాంపట్నంలో ఇప్పటికే ఉన్న హార్బర్ అభివృద్ధికి నిర్ణయం తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సాగర్ మాల ఫేజ్-2లో భాగంగా రూ.417.55 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది. మ్యారీటైప్ బోట్ ప్రాజెక్టు ఏజెన్సీ టెండర్లను దక్కించుకుంది. 52 ఎకరాలు అవసరం కాగా, 15.67 ఎకరాల వరకు స్థలాన్ని రెవెన్యూ శాఖ అప్పగించింది. మరో 35.77 ఎకరాలు సేకరించి నెలల వ్యవధిలో హార్బర్ పనుల పూర్తికి మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ హార్బర్ నిర్మాణానికి ఫిషరీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎఫ్‌ఐడీఎఫ్) రూ.150 కోట్లు, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌ఐడీఏ) రూ.240.8 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.26.75 కోట్లు వెచ్చించనున్నాయి.

హార్బర్ నిర్మాణం పూర్తయితే..

హార్బర్ నిర్మాణం పూర్తయితే తీరప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సముద్రంలోకి వెళ్లి వేటాడి తెచ్చిన మత్స్య సంపదను ఒడ్డుకు తెచ్చుకునే అవకాశం లేదు. కాకినాడ లేదా చెన్నై వెళ్లాల్సి వస్తోంది. నిజాంపట్నం హార్బర్ ఉన్నా.. సామర్థ్యం చాలడం లేదు. చీరాల వాడరేవు నుంచి కాకినాడ, చెన్నైకి సుమారు 250 కిలోమీటర్ల దూరం. స్థానికంగా సరైన స్టోరేజి సదుపాయాలు లేకపోవడంతో దళారులు అయినకాడికి మత్స్య సంపదను దోచుకుంటున్నారు. అనక చెన్నై, బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అదే వాడరేవులో హార్బర్ నిర్మాణమైతే కోల్డ్ స్టోరేజ్‌లు అందుబాటులోకి వస్తాయి. దళారుల ఆట కడుతుంది. బాపట్ల జిల్లాలోని ఏడు తీరప్రాంత మండలాలతోపాటు ఒంగోలు, నెల్లూరు నుంచీ బోట్లు వాడరేవుకు వచ్చే అవకాశం ఉంది. స్థానికంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటవుతాయి. మత్స్యకార మహిళలకు జీవనోపాధి లభిస్తుంది.

రెండు నెలల్లో పనులు ప్రారంభం

హార్బర్ నిర్మాణ టెండర్లను 'మ్యారీ టైప్ బోట్' అనే సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ రెండు నెలల్లో పనులు ప్రారంభించనుంది. ఇప్పటి వరకు నిజాంపట్నం వద్ద ఉన్న జెట్టీలోనే వాడరేవు మత్స్యకారులూ మెకనైజ్డ్ బోట్లు నిలుపుకోవాల్సిన దుస్థితి ఉంది. ప్రస్తుతం హార్బర్ నిర్మాణంలో భాగంగా స్థానికంగా జెట్టీనీ నిర్మిస్తారు. ఇందులో 1,000 మోటార్ పడవలు, 650 మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునే అవకాశం ఉంది. అలాగే మత్స్య సంపద నిల్వకు పెద్ద ఎత్తున ఐస్ ప్లాంట్లు, చేపల అమ్మకానికి వీలుగా ప్లాట్‌ఫాంలు, ఆక్షన్ హాల్ నిర్మిస్తారు. బోట్ల మరమ్మతులకు మెకానిక్ షెడ్లు, చేపలు ఎండబెట్టుకునే ప్లాట్‌ఫాంలు, సబ్సిడీ ఆయిల్ బంకులు, వలల అల్లిక, మరమ్మతులకు ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు. హార్బర్ నిర్మాణమైతే ఏడాదికి మరో 70 వేల టన్నుల అదనపు ఎగుమతులకు అవకాశం కలుగుతుంది.

హార్బర్‌తో ఎనలేని మేలు..



పదేళ్ల నాటి ప్రతిపాదన ఇప్పటికి ఆచరణలోకి వచ్చింది. పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమవుతాయి. ఈ హార్బర్ నిర్మితమైతే మత్స్యకారులకు ఎనలేని మేలు జరుగుతోంది. మత్స్య సంపదకు రెట్టింపు ధర వస్తుంది. దళారుల వ్యవస్థకు ఆస్కారం ఉండదు. మత్స్య సంపద ఎండబెట్టుకునేందుకు ఫ్లాట్‌ఫాంలు, నిల్వకు కోల్డ్ స్టోరేజీలు, డీజిల్ బంకులు, రవాణా వ్యవస్థకు అనుకూలంగా రోడ్లు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ పి.సురేష్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్

జిల్లాకే తలమానికం..



వాడరేవు జిల్లాకే తలమానికంగా మారుతుంది. రూ.417.55 కోట్లతో నిర్మిస్తున్న హార్బర్ వల్ల బాపట్ల జిల్లాకు చుట్టుపక్కల ఉన్న నెల్లూరు, ఒంగోలు, కాకినాడ నుంచి వచ్చే మరపడవలు ఇక్కడ ఆగుతాయి. స్థానికంగా ఉన్న మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నా హయాంలో వాడరేవులో హార్బర్ ఏర్పాటు కావడం అదృష్టంగా భావిస్తున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్వరలో పనులూ ప్రారంభం కానున్నాయి. వాడరేవుతో పాటు చీరాల నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది.

– కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే

స్వచ్ఛ పల్లెలే లక్ష్యం

జెడ్పీ సీఈఓ జె.మోహనరావు



గుంటూరు ఎడ్యుకేషన్: స్వచ్ఛ గ్రామ పంచాయతీలే లక్ష్యంగా పనిచేద్దామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పురస్కారాలను అందుకోవడంలో పోటీ పడదామని జెడ్పీ సీఈఓ జె.మోహనరావు సిబ్బందికి సూచించారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో స్వచ్ఛభారత్ మిషన్-స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023పై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండలస్థాయి పీర్ కమిటీ సభ్యులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈఓ మోహనరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వెయ్యి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా పీర్ కమిటీలు కృషి చేయాలని సూచించారు. మహాత్మాగాంధీ జయంతి రోజైన అక్టోబర్ రెండున కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ఉత్తమ పురస్కారాలు ప్రకటిస్తుందని చెప్పారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలలో ఉత్తమ గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేస్తుందని చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 55 పీర్ కమిటీలు తమ మండల పరిధిలోని గ్రామ పంచాయతీలను సందర్శించి ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో ఎస్ఎస్‌జీ-2023 మార్గదర్శకాల ప్రకారం జూన్ 15లోపు ఎంట్రీలు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పంచాయతీ అధికారులు ఆర్.కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, పంచాయతీ రాజ్ ఎస్ఈలు ఆర్.సురేష్, ఆర్ఎస్ఆర్ సురేష్, సి. విజయకుమార్, డీపీఆర్సీ పద్మాకర్, పీర్ కమిటీల్లో సభ్యులైన గ్రామ సర్పంచ్, కార్యదర్శి, స్వయం సహాయక బృంద సభ్యులు, ఈవోపీఆర్డీ, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పంట నష్టం జాబితా సిద్ధం

- 20 వరకు ఆర్బీకేల్లో ప్రదర్శన
- నమోదు కాని పేర్లుంటే చేర్పులకు అవకాశం
- ఏప్రిల్ 30 నుంచి మే 6 వరకు అకాల వర్షాలు
- వర్షానికి తడిసి పాడైన 15,685 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు
- నీటమునిగిన 559 మెట్రిక్ టన్నుల జొన్నలు
- 20 తరువాత ప్రభుత్వానికి పంట నష్టం నివేదిక



వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నివేదికను ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఈనెల 20 తర్వాత ఆ నివేదికను ప్రభుత్వానికి అధికారులు పంపనున్నారు. ఆ తర్వాత నష్ట పరిహారాన్ని ప్రభుత్వం రైతులకు అందించనుంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరాక పంటలకు నష్టం జరిగిన ప్రతిసారీ రైతులకు అండగా నిలుస్తోంది. న్యాయమైన పరిహారం అందిస్తోంది.

ఏప్రిల్ 30 నుంచి మే 6వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అకాల వర్షాలు కురిశాయి. ప్రధానంగా చుండూరు, అమృతలూరు, రేపల్లె, భట్టిప్రోలు, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి మండలాల్లో అధికంగా వర్షం కురిసింది. మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలు కురిసే నాటికి పంటల కోతలు పూర్తి కావడంతో కల్లాల్లో ఉన్న పంట మొత్తం వర్షపు నీటిలో తడిసిపోయింది. మొక్కజొన్న కండెలు, గింజలు, జొన్న గింజలు, వేరుశనగ కాయలు నీటిలో తడిశాయి. దీంతో కొన్ని మొలకలు రాగా మరికొన్ని బూజు పట్టి పనికి రాకుండా పోయాయి.

ఆర్బీకేలలో జాబితా

ప్రభుత్వ ఆదేశాలతో పంటనష్టం జాబితాలు సిద్ధం చేసిన జిల్లా వ్యవసాయశాఖ ఆ జాబితాలను స్థానిక ఆర్బీకేలలో గురువారం నుంచి ప్రదర్శనకు పెట్టింది. ఈనెల 20 వరకు ఆర్బీకేలలో జాబితాలు ఉంటాయి. వాటిని పరిశీలించి పంటనష్టం జరిగి జాబితాలో పేరు లేకుంటే అటువంటి వారు తిరిగి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. సవరణల అనంతరం తుది జాబితా సిద్ధం చేసి ఈనెల 20 తర్వాత జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తారు. వాస్తవానికి పంట సమయంలో వర్షం వల్ల నష్టం జరిగితే దానికి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుంది. పంట కోతదశ పూర్తయ్యాక కల్లాల్లో వర్షానికి తడిసి పంట పాడైంది. అధికారులు పంపిన నివేదికను పరిశీలించి ప్రభుత్వం పరిహారం అందించే అవకాశం ఉంది.

నివేదిక ప్రభుత్వానికి పంపుతాం



ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాలతో జిల్లాలోని ఎనిమిది మండలాల్లో మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలు కోత తరువాత నీటిలో తడిసి దెబ్బతిన్నాయి. వాటి వివరాలను మండల స్థాయిలో అధికారుల ద్వారా సేకరించి జాబితాలను ఆర్బీకేలలో ఉంచాము. రైతులు వాటిని చూసుకోవచ్చు. పొరపాటున పేర్లు నమోదు కాకపోయి ఉంటే రైతుల వినతి మేరకు తిరిగి నమోదు చేసి తుది జాబితాను ఈనెల 20 తర్వాత కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతాం.

– అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి

పంటల నష్టం ఇలా..

వర్షంతో కోత పూర్తి అయిన 5,428 ఎకరాల్లోని 15,685 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు నీటిలో తడిసి పాడయ్యాయి. దీంతో 3,250 మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. 274 ఎకరాల్లోని జొన్న పంటకు సంబంధించి 559 మెట్రిక్ టన్నుల జొన్న గింజలు తడిసి పోయాయి. దీనివల్ల 126 మంది రైతులు నష్టపోయారు. వీరితోపాటు 76 ఎకరాల్లోని 152 మెట్రిక్ టన్నుల వేరుశనగ కాయలు తడిసి పోవడంతో 45 మంది రైతులకు నష్టం వాటిల్లింది.

నిర్బంధ వ్యాయామ విద్య అవసరం

అర్జున, ద్రోణాచార్య అవార్డుల గ్రహీత శ్యాంసుందరరావు



తెనాలి: మొవ్వా శ్యాంసుందరరావు వాలీబాల్ ఆటలో శిఖర సమానులు. అత్యుత్తమ క్రీడా పురస్కారాలైన 'అర్జున', 'ద్రోణాచార్య' రెండింటినీ స్వీకరించిన క్రీడోత్తములు. దేశవ్యాప్తంగా ఈ రెండు గౌరవాలను అందుకున్న ఎనిమిది మందిలో ఒకరు. జాతీయ క్రీడాకారుడిగా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా, నేషనల్ కోచ్‌గా దేశంలో వాలీబాల్ ఆట పురోగతికి శాయశక్తులా ఆయన కృషి చేశారు. హైదరాబాద్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్న శ్యాంసుందరరావు చాలాకాలం తర్వాత స్వస్థలమైన తెనాలి వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ప్రస్తుతం బాపట్ల జిల్లా వేమూరు సమీపంలోని జంపని నా స్వగ్రామం. తెనాలిలోని టీజే హైస్కూలు, మున్సిపల్ హైస్కూలు, వీఎస్సార్ కాలేజీలో చదువుకున్నా. క్రీడా సాధనకు అంకురార్పణ ఇక్కడే. క్రీడలకు, క్రీడాకారులకు ఆ రోజుల్లో ప్రోత్సాహం అధికంగా ఉండేది. ఇక్కడే స్టేట్, సౌత్‌జోన్ స్థాయి టోర్నమెంట్లు జరిగాయి. ఎందరో క్రీడాకారులు వెలుగులోకి రాగలిగారు. మళ్లీ ఇప్పుడు తెనాలి స్టేడియంలో క్రీడా సాధనలో ఇందరుండటం సంతోషంగా ఉంది.
- వాస్తవానికి నేను బాల్‌బ్యాడ్మింటన్ ఆటగాడిని. ఆంధ్రా యూనివర్సిటీలో రన్నరప్‌గా వచ్చాం. అఖిల భారతస్థాయి టోర్నమెంట్లు ఆడాను. ఈ ప్రాంతంలో వాలీబాల్‌కు విశేష ప్రాచుర్యం కల్పించిన కోచ్ బుచ్చిరామయ్య తెనాలి కాలేజీకి కోచింగ్‌కని రావటంతో, ఆయన శిక్షణలో వాలీబాల్ సాధన చేశాను. ఆంధ్రా యూనివర్సిటీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, ఇండియన్ రైల్వేస్, తమిళనాడు, రాజస్థాన్ స్టేట్‌కు ప్రాతినిధ్యం వహించాను. వరుసగా 20 ఏళ్లు జాతీయ చాంపియన్‌షిప్‌లో ఆడాను. అందులో 12కు పైగా ఫైనల్స్‌లో పాల్గొన్నాను. 1966–1978 వరకు భారత వాలీబాల్ జట్టులో వివిధ దేశాలపైనా, 1966, 1970, 1974 ఆసియా గేమ్స్‌లోనూ ఆడాను. క్రీడాకారుడిగా భారత ప్రభుత్వ అర్జున అవార్డును 1974లో స్వీకరించాను.
- 1973లో పాటియాలలోని ఎన్ఐఎస్‌లో ఉత్తీర్ణుడినై 1978లో బ్యాంకాక్ ఆసియా గేమ్స్‌లో భారత జట్టు సహాయ కోచ్‌గా చేశాను. రష్యా, ఈజిప్టులో ఆడిన భారత జట్టు కోచ్‌గా వ్యవహరించాను. నా నేతృత్వంలోనే జూనియర్ భారత జట్టు 1994 ఆసియా గేమ్స్‌లో తొలిసారిగా రజత పతకం సాధించింది. చైనాలో జరిగిన ప్రపంచ టోర్నీ అర్హత పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచింది. ఇరాన్‌లో జరిగిన అంతర్జాతీయ టోర్నమెంటులో కాంస్య పతకం నెగ్గింది. 1995లో జర్మనీలో జరిగిన పోటీల్లో భారత వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. ఆ తర్వాత చీఫ్ కోచ్‌గానూ జట్టు విజయాలకు దోహదపడ్డాను. ఈ విజయాలకు 1995లో 'ద్రోణాచార్య' అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది.

ఎన్ఐఎస్ బెంగళూరులో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పథకం (1990–96)లో, విశాఖపట్నం వాలీబాల్ అకాడమీ (1996–99), శాప్ వాలీబాల్ అకాడమీ (2000–02)లో చీఫ్ కోచ్‌గా ఎందరో జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లను తీర్చిదిద్దాను. భారతప్రభుత్వ నేషనల్ వాలీబాల్ కోచ్‌గా 2007 నుంచి 2011 వరకు పనిచేశాను.

- నేటి అకడమిక్ విద్యలో విద్యార్థులకు ఆటలకు తగిన సమయం ఉండటం లేదు. రోజుకో గంట సమయం ఆటలతో మంచి క్రీడాకారులు తయారుకాలేరు. నిర్బంధ వ్యాయామ విద్యతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యం. ఉత్తమ క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచన చేయాలని నా వ్యక్తిగత భావన. ముఖ్యంగా పిల్లలను తల్లిదండ్రులే ఆటలకు ప్రోత్సహించాలి. పీవీ సింధు, జ్యోతిసురేఖ విజయాల్లో వారి తల్లిదండ్రుల పాత్ర ఎంతగానో ఉంది. తల్లిదండ్రులు, పీఈటీల ప్రోద్బలం ఉన్నపుడు మంచి క్రీడాకారులు వస్తారు.
- భారత వాలీబాల్ జట్టు ఎంపికకు ఇప్పుడు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆసక్తిగా ఉంది. అడ్‌హక్ కమిటీతో జట్టు ఎంపిక చేసి పోటీలకు పంపుతామని చెబుతోంది. ఎలాగుంటుందో వేచిచూడాలి. ఫెడరేషన్ పాలిటిక్స్ మూలంగా చెప్పలేం.

పవర్‌లిఫ్టింగ్‌లో చీరాల క్రీడాకారుల ప్రతిభ



బంగారు పతక విజేత ద్వారక



కాంస్య పతక విజేత లక్ష్మి

చీరాల రూరల్: జాతీయ స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో చీరాలకు చెందిన ఇద్దరు సత్తాచాటారు. జూనియర్ విభాగంలో సాతుపాటి ద్వారక బంగారు పతకం కైవసం చేసుకోగా సబ్ జూనియర్ విభాగంలో మరో క్రీడాకారిణి లక్ష్మి కాంస్య పతకం సొంతం చేసుకుంది. ఈనెల 12 నుంచి 17 వరకు చెన్నైలో జాతీయ స్థాయిలో జూనియర్, సబ్ జూనియర్ పోటీలు నిర్వహించారు. చీరాల ఉజిలిపేటకు చెందిన డిగ్రీ విద్యార్థిని ద్వారక జూనియర్ విభాగంలో, ఎస్.లక్ష్మి సబ్ జూనియర్ విభాగాల్లో పాల్గొన్నారు. 83 కేజీల జూనియర్ విభాగంలో పోటీపడిన ద్వారక అన్ని విభాగాల్లో స్నాచ్‌లో 230 కేజీలు, బెంచ్ 100 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 200 కేజీలు ఓవరాల్‌గా 530 కేజీలు ఎత్తి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బంగారు పతకం కైవసం చేసుకుంది. అలానే 63 కేజీల సబ్ జూనియర్ విభాగంలో ఎస్.లక్ష్మి స్నాచ్‌లో 145 కేజీలు, బెంచ్ 65 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 132.5 కేజీలు ఎత్తి కాంస్య పతకం సొంతం చేసుకుంది.

సుబ్బారాయుడికి లక్ష మల్లెల పూజ



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష మల్లెల పూజ గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో కొమ్మూరి ఫణికుమార్ శర్మ, నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ కుటుంబ సమేతంగా, సీఐలు భీమేశ్వర రవికుమార్, జి.శ్రీనివాస్ పూజలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం తరపున డీఎస్పీ దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ఏసీ స్వామివారి లడ్డూ ప్రసాదాలు అందివ్వగా, వేద పండితులు బాలకృష్ణ శర్మ, ఫణికుమార్ శర్మ మణిదీప్ శర్మ, వెంకటేశ్వరావు ఆశీర్వచనాలు అందజేశారు.

మంటల్లో చిక్కుకుని రైతు సజీవ దహనం

పొలాల్లో వ్యర్థాలను దహనం చేస్తుండగా ఘటన



నాదెండ్ల: పొలంలోని వ్యర్థాలను దహనం చేసే క్రమంలో మంటలు అంటుకుని ఓ రైతు సజీవ దహనమైన ఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బండారుపల్లి వెంకటేశ్వర్లు (70) వ్యవసాయం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం తన సొంత పొలానికి వెళ్ళాడు. గట్లపై గడ్డి, పిచ్చి చెట్లను తొలగించి వ్యర్థాలకు నిప్పు పెట్టాడు. ఎండ తీవ్రత, వడగాలులతో మంటలు చెలరేగి అతన్ని చుట్టుముట్టాయి. దుస్తులకు మంటలు అంటుకోవటంతో సజీవ దహనమయ్యాడు. సాయంత్రం ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్ళి చూడగా, పూర్తిగా దహనమై విగతజీవిగా కనిపించాడు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఆయనకు భార్య సత్యవతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

క్లుప్తంగా

10లోపు జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తులు

బాపట్లఅర్బన్: జగనన్న విదేశీ విద్యా దీవెనకు జూన్ 10లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సాధికారత అధికారి జే.రాజా దెబోరా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఈబీసీ వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 8 లక్షలలోపు, విద్యార్థి వయస్సు నోటిఫికేషన్ నాటికి 35 సంవత్సరాల్లోపు ఉండాలి. ఆదాయ ధృవీకరణ పత్రం నిర్దేశిత ప్రొఫార్మాలో మాత్రమే ఉండాలన్నారు. https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవావాలన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ నందు గల జీవోలు చూడాలన్నారు.

మిషన్ వాత్సల్య దరఖాస్తులు పరిశీలించండి

గుంటూరువెస్ట్:పిల్లలను దత్తత తీసుకునే కార్యక్రమంలో భాగంగా మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్, ఫాస్టర్ కేర్‌కు వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వితంతువులు, విడాకులు పొందిన మహిళల పిల్లలు, తల్లిదండ్రులు కోల్పోయి సంరక్షకుల వద్ద ఆశ్రమం పొందుతున్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే తల్లిదండ్రుల పిల్లలు తమ పిల్లలను దత్తత ఇచ్చే సౌలభ్యం ఉందన్నారు. సంరక్షణా గృహాల్లో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, పిల్లల కోసం దత్తత కోరే వారి అర్జీలు పారదర్శకంగా పరిశీలించాలన్నారు.

సీఐ కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు

రూ.10లక్షలు అందజేసిన ఎస్పీ వకుల్‌జిందాల్



మృతుడి భార్య వెంకటలక్ష్మికి రూ.10 లక్షల నగదు అందజేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: గుండెపోటుతో మృతిచెందిన సీఐ మల్లి నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు రూ.10 లక్షల నగదు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ గురువారం అందజేశారు. నాగేశ్వరరావు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు అంజనీకుమార్‌లకు రూ.7 లక్షల నగదు, భర్త మరణించడంతో నాగేశ్వరరావు సంరక్షణలో జీవనం సాగిస్తున్న అతడి సోదరి వై.రాధకు రూ.3 లక్షలు అందజేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ 1996 బ్యాచ్‌కి చెందిన మల్లి నాగేశ్వరరావు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించడం వల్ల చిన్నాభిన్నం అయిన అతడి కుటుంబాన్ని ఆదుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న 1996 పోలీస్ ఎస్ఐ బ్యాచ్‌మేట్స్ అందరూ కలిసి రూ.10 లక్షలు సమకూర్చారన్నారు. ఎస్ఐలు ముందుకు వచ్చి నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. నాగేశ్వరరావు కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని, శాఖాపరంగా కుటుంబానికి రావాల్సిన అన్నిరకాల పరిహారాలు, రాయితీలు సకాలంలో అందించడానికి కృషి చేస్తామన్నారు. వారికి ఏదైనా సమస్య వస్తే నేరుగా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు చీరాల రూరల్ సీఐ ఎ.మల్లికార్జునరావు, ఎస్బీ సీఐ ఎ.శ్రీనివాస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు నవలా సామ్రాజ్యాన్ని ఏలిన యద్దనపూడి



సులోచనరాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రావూరి నరసింహవర్మ, మాల్యాద్రి తదితరులు

బాపట్లఅర్బన్: నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి తెలుగు నవలా సామ్రాజ్యాన్ని దాదాపు నాలుగు దశబ్దాలపాటు ఏకధాటిగా ఏలారని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ అన్నారు. సుప్రసిద్ధ నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి ఐదో వర్ధంతి సందర్భంగా గురువారం సాహితీ భారతి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సభకు రావూరి నరసింహ వర్మ అధ్యక్షత వహించారు. యద్దనపూడి సులోచన రచించిన మీనా, సెక్రటరీ, జీవన తరంగాలు, విచిత్రబంధం, బంగారు కలలు, జై జవాన్ తదితర నవలలు సినిమాలుగా కూడా నిర్మించబడ్డాయని తెలిపారు. ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ సులోచన రాణి మధ్యతరగతి కుటుంబంలో జన్మించి బాంధవ్యాలు, ఆత్మీయతానురాగాలు, ఆత్మస్థైర్యానికి అక్షర రూపాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. ఆమె రచించిన కీర్తికిరీటాలు నవలకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, ఆత్మగౌరవం, కాంచన గంగ చిత్రాలకు నంది అవార్డులు లభించాయని తెలిపారు. కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ వారు రచించిన రుతురాగాలు, రాధా మధు, ఆగమనం, అగ్నిపూలు, కెరటాలు వంటి టీవీ సీరియల్స్ తెలుగు వీక్షక లోకాన్ని మంత్రముగ్ధులను చేశాయని కొనియాడారు. అనంతరం యద్దనపూడి సులోచన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో ఎం.జాకబ్, ఎస్.కృష్ణ, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళీ, రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలంటే చంద్రబాబుకు అంత చులకనా

- అమరావతి ప్రాంతంలో నివసించడానికి పేదలకు అర్హత లేదా?
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ధనికుల పక్షపాతి చంద్రబాబు
- పెదకాకానిలో నారా చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మ దహనం



పెదకాకానిలో చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే కిలారి, ఇతర నాయకులు

పెదకాకాని: పేద ప్రజలు అమరావతి రాజదాని ప్రాంతంలో నివసించడానికి అర్హత లేదా అని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య టీడీపీ నాయకులను ప్రశ్నించారు. పేదలకు పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలపై సెంటు భూమి శవాన్ని పూడ్చిపెట్టడానికి కూడా సరిపోదని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హేళనగా మాట్లాడటంపై పెదకాకానిలో ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ నివాస స్థలాలు ఉండాలనే ఆశయంతో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్న చంద్రబాబునాయుడు ధనికుల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నాడన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి, అమరావతి రాజధాని ప్రాంతంలో తుళ్లూరు, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ ప్రాంతాలకు చెందిన 50 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుంటే టీడీపీ శ్రేణులు తమ అక్కసు వెళ్లబోస్తున్నారన్నారు. గతంలో కూడా వ్యవసాయం దండగ అని హేళన చేసిన చంద్రబాబు నాయుడు బీసీలను తోకలు కత్తిరిస్తానని, ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని అవమానకరంగా మాట్లాడటం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని గుర్తు చేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా అడ్డుకోవడమే కాకుండా సెంటు స్థలంలో శవాన్ని పూడ్చడం కూడా సాధ్యం కాదని మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడిని పేద ప్రజలు రోడ్డుపై కూడా తిరగకుండా చేస్తారన్నారు. ధనికుల పక్షపాతి చంద్రబాబు నాయుడు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వారిలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, సర్పంచి గోళ్ల స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు బంగారు మరియమ్మ, మాతంగి నిర్మల, షేక్ గుల్జార్, స్థానిక నాయకులు వుయ్యూరి సతీష్‌రెడ్డి, సయ్యద్ సుబాని, షేక్ నజీర్, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, కొంకి రామారావు, బుల్లా మోజెస్, శివాబత్తుని దయానంద్, అంకుల్, షేక్ ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా, తొమ్మిది మందికి గాయాలు



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

మేదరమెట్ల: ప్రార్థనలో పాల్గొని తిరుగు ప్రయాణమైన ఆటో బోల్తా పడటంతో ఏడుగురికి గాయాలవ్వగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మేదరమెట్ల జాతీయ రహదారిపై కొండ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది ఆటోలో ఒంగోలులో నిర్వహించిన ప్రార్థనకు వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా సరిగా మేదరమెట్ల కొండ సమీపంలోకి రాగానే ఒంగోలు నుంచి అద్దంకి వెళ్లేందుకు ఓ కారు అతివేగంగా వచ్చి కొండ సమీపంలో గల సర్వీసు రోడ్డులోకి తిప్పాడు. అదే సమయంలో వెనుక వస్తున్న ఆటో కారు ఒక్కసారిగా పక్కకు తిప్పడాన్ని గమనించిన ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పిన ఆటో రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న వారు ఒకరిపై ఒకరు పడటం కొందరు రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. వీరిలో కొత్తపల్లి ఇందు తలకు తీవ్ర గాయం కాగా కొత్తపల్లి సుబ్బాయమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్సై శివనాగిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును ప్రత్యక్ష సాక్ష్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీతో దేశ చరిత్ర తిరగరాశారు

ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు

తాడికొండ:భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో 35 లక్షల ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, రాజధానిలో 50 వేలకుపైగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రను తిరగరాశాడని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటన్నారు. పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలివ్వడం మీకు ఎందుకు అభ్యంతరమో ప్రజల్లోకి వచ్చి చెప్పగలరా అని ప్రశ్నించారు.

రైలు కిందపడి ఉద్యోగి ఆత్మహత్య



లక్ష్మీప్రసన్న (ఫైల్)

చీరాల రూరల్: మనస్తాపంతో సచివాలయ ఉద్యోగి రైలుకిందపడి బలవన్మరణం చెందింది. ఈఘటన బుధవారం రాత్రి చీరాల-జాండ్రపేట రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగింది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. చినగంజాం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న (30)చీరాలలోని వైకుంఠపురం విఠల్‌నగర్ సచివాలయంలో శానిటేషన్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈమెకు గతంలోనే వివాహం జరగగా కుటుంబ కలహాల నేపథ్యంలో విడివిడిగా ఉంటున్నారు. తల్లిదండ్రుల వద్ద ఉంటూ ఈమె విధులకు హాజరయ్యేది. ఈ క్రమంలో మృతురాలు లక్ష్మీప్రసన్న, గోపి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, వీరి వివాహం విషయంలో కొంత కాలంగా ఆమె ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలోనే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరుకుల హక్కుల పోరాట సమితి ధర్నా..

మృతురాలు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడంతో మృతురాలి తండ్రి వారి బంధువులు ఎరుకుల హక్కుల పోరాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మతో కలసి న్యాయం చేయాలంటూ ధర్నా చేశారు. ఘటనకు కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ముస్లిం మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి జగనన్న

పట్నంబజారు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షేక్ జిలానీ వెల్లడించారు. గురువారం నగరంపాలెంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హజ్ యాత్రకు సంబంధించి ముస్లింలపై పడుతున్న అధిక భారాన్ని తగ్గిస్తూ సీఎం జగన్ ఆబాధ్యతనుఆయన భుజాన వేసుకోవడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మైనార్టీ వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. ముస్లింలకు హజ్ యాత్ర ఎంతో పవిత్రమైందన్నారు. 1813 మందికి రూ. 80 వేలు చొప్పున రూ.14.51 కోట్లు ఆర్థిక సహాయాన్ని అందజేసి తాను మనస్సు ఉన్న ముఖ్యమంత్రినని చాటుకున్నారన్నారు.

హెచ్‌ఎం, టీచర్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు సస్పెన్షన్

- రికార్డుల తారుమారు, అక్రమ పోస్టింగ్ వ్యవహారంలో చర్యలు
- ఒకే సంఘటనలో మొత్తం ఆరుగురిపై వేటు

గుంటూరు ఎడ్యుకేషన్: డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయురాలికి రెగ్యులర్‌గా పోస్టింగ్ కల్పించేందుకు ప్రయత్నించిన వ్యవహారంలో ఒక హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయురాలు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు పడింది. గుంటూరు రూరల్ గోరంట్ల పరిధిలోని అన్నపూర్ణనగర్ ఎంపీపీ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు డి. మల్లిఖార్జునరావు, పిడుగురాళ్ల ఎంపీపీ స్కూల్లో ఎస్జీటీగా పనిచేస్తున్న డి.నాగరాజకుమారితో పాటు ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ డీఈవో పి.శైలజ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. పిడుగురాళ్ల ఎంపీపీ స్కూల్లో ఎస్జీటీగా పని చేస్తున్న డి. నాగరాజకుమారిని గతంలో డిప్యూటేషన్‌పై గుంటూరు డీఈవో కార్యాలయంలో ఏపీవోగా పోస్టింగ్ ఇచ్చారు. కాగా ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేసిన తరువాత సదరు ఉపాధ్యాయినిని మాతృ పాఠశాలకు పంపకుండా, రికార్డులను తారుమారు చేసి, నిబంధనలకు విరుద్ధంగా గుంటూరు రూరల్ గోరంట్ల, అన్నపూర్ణనగర్‌లోని ఎంపీపీ స్కూల్లో పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సంఘటనపై విచారణ జరిపించిన ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల గుంటూరు ఎంఈవో ఖుద్దూస్‌తో పాటు సూపరింటెండెంట్‌గా పని చేసిన పి. నరసింహారావును సస్పెండ్ చేశారు. తాజాగా మరో నలుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. మొత్తంమీద ఈ వ్యవహారంలో ఆరుగురు సస్పెండయ్యారు.

హాజీలకు వ్యాక్సినేషన్ శిబిరం

ప్రారంభించిన రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గౌసుల్ ఆజం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్.గౌసల్‌ఆజం అన్నారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని బి.ఎస్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ శాఖ అధ్యక్షతను రాష్ట్ర స్టేట్ హజ్ కమిటీ వారి ఆధ్వర్యంలో గురువారం హజ్ యాత్రికులకు వాక్సినేషన్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా హజ్ యాత్రికులు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి సంబంధిత హజ్ కమిటీ చైర్మన్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని ముస్లింల అభ్యున్నతి కోరుతున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది పవిత్ర హజ్ యాత్రకు 1814 మంది హాజీలు వెళ్తుంటే వారికి అన్ని విధాల సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తోందని తెలిపారు. ప్రతి హజ్ యాత్రికుడు తిరిగి వారి వారి గమ్యస్థానానికి చేరుకునేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్పష్టంగా తెలియజేశారు. అనంతరం హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్‌ను అందజేసి మెడికల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ముఫ్తీ బాసిత్, గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్.షజీలా, హజ్‌కమిటీ సభ్యులు, డాక్టర్లు, పార్టీ మైనారిటీ నాయకులు షౌకత్, గులాంరసూల్ , షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.